# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 22-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రాన్ని వ్యర్థ రహితంగా మార్చేందుకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

3. **మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.**

4. **ఉత్తరాంధ్రకు తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.**

==========================

రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక సంస్థల పరిధిలో 11 వేల 359 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నుంచి దృశ్యమాధ్యమం విధానంలో ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 123 మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని వ్యర్థ రహితంగా మార్చేందుకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాలను అభివృద్ధికి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేస్తూ...

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పర్యటన రెండవ రోజు కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా నాగులాపల్లిలో మంచినీటి సరఫరా పథకం ప్రారంభించారు. అనంతరం పిఠాపురంలో 15 వందల కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ... పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఉప్పాడ సముద్ర తీరం కోతకు గురి కాకుండా చర్యలు చేపట్టామని ఉప ముఖ్యమంత్రి తెలియజేస్తూ....

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత ఏర్పడుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 20 శాతం పెరిగిందని, విద్యుత్ అవసరాలను అధిగమించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ-ఏపీ జెన్‌కో ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జెన్‌కో ద్వారా 5 వేల 5 వందల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైన సమయంలో బయటి నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే, గంటల వ్యవధిలోనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత కోసం చేపట్టిన వోకల్ ఫర్ లోకల్ కార్యక్రమం గురించి ఈ రోజు తెలుసుకుందాం.

భారతదేశంలో వినియోగదారుల ప్రాధాన్యతలు క్రమంగా విదేశీ వస్తువులు, పెద్ద బ్రాండ్ ఉత్పత్తుల వైపు మళ్లడంతో కుటీర పరిశ్రమ, చేతివృత్తుల వారికి మార్కెట్‌లో సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో 'స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత'- వోకల్ ఫర్ లోకల్ ప్రచారం ద్వారా, స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. దీంతో చేతివృత్తుల వారికి స్థానికంగా గిరాకీ పెరిగే అవకాశం ఏర్పడింది. వోకల్ ఫర్ లోకల్ ద్వారా తరతరాలుగా కొనసాగుతున్న భారతీయ వారసత్వాన్ని పరిరక్షించడంలో భాగంగా, చేతివృత్తులు, చేనేత రంగం, విశ్వకర్మ సంప్రదాయాలకు గౌరవం, మద్దతు, అవకాశాలు కల్పించడంపైనా దృష్టి సారించారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశీయ ఉత్పత్తి, ఉపాధి, స్వావలంబనకు మద్దతు తెలుపవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ బీటీసీ పరేడ్

గ్రౌండ్స్‌లో 2025-26 బ్యాచ్‌కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ను ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..

వాయిస్..300. సెకన్లు

-------------------------

ఉత్తరాంధ్రలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతతో సిద్ధంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో వర్షాల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్, ఎస్పీతో సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత గ్రామాలు, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

మరోవైపు విజయనగరం జిల్లాలోనూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. అత్యవసర సేవల కోసం శ్రీకాకుళం జిల్లా హెల్ప్‌లైన్ నెంబరు 08942-240557, విజయనగరం జిల్లా హెల్ప్‌లైన్ నెంబరు 08922-236947ను సంప్రదించాలని మంత్రి సూచించారు.

-------------------------

పోషణ్ మాసోత్సవ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల పోషణ్ మాసోత్సవ చిత్ర ప్రదర్శనను పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి ఈరోజు ప్రారంభించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంపై ప్రచురించిన సేవా సంకల్ప అభియాన్ ప్రచురణలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తల సహకారంతో బాలింత మహిళల, శిశువుల సమగ్ర పోషణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను, ప్రోత్సాహకాలను అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబిసి డైరెక్టర్ జి.సురేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

-------------------------

కేంద్ర సహకార బ్యాంకుల్లో పారదర్శక లావాదేవీల కోసం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆధునికీకరించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రాంగణాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

====================